వినాయక్‌నగర్‌లో నిర్మాణంపై వివాదం

పట్టించుకోని అధికారులు

బోరబండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఆర్ హిల్స్ వినాయక్ నగర్ ప్రధాన రహదారిపై అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణం వివాదాలకు దారితీస్తోంది. ఎలాంటి అనుమతి లేకుండా రోడ్డుపై కట్టిన ఇల్లు, ప్రహరీ కూల్చాలని బస్తీ మాజీ అధ్యక్షులతోపాటు ప్రజలు కోరుతున్నారు.

రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ వినాయక్ నగర్ ప్రధాన రహదారిపై కొంతమంది నాయకుల ఆధ్వర్యంలో ఇల్లు, దానిచుట్టూ ప్రహరీ నిర్మించారు. దీనిపై అనేక ఫిర్యాదులు రావడంతో ఇల్లు, ప్రహరీ గేటుకు జీహెచ్ఎంసీ సిబ్బంది తాళం వేశారు. రెవెన్యూ సిబ్బంది ఇంటి ప్రహరీని కూల్చారు. అయినా, నిర్మాణాన్ని కొన సాగించడంతో గత ఏప్రిల్ 30న జీహెచ్ఎంసీ సర్కిల్-19 టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఎస్.ప్రసీద, సిబ్బందితో పాటు ఖైరతాబాద్ మండల రెవెన్యూ సిబ్బంది కలిసి కూల్చివేశారు. కూల్చివేతను ఇరు శాఖల సిబ్బంది తమ విజయంగా చెప్పుకున్నారు. అప్పటి నుంచి అలాగే వదిలేసిన నాయకులకు ఇటీవల జరిగిన జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక అవకాశంగా మారింది. వివిధ శాఖల అధికారులంతా ఎన్నికల పర్యవేక్షణలో తల మునకలై ఉండగా, ఎన్నికలకు రెండురోజుల ముందు మళ్లీ ఆ స్థలంలో ఇల్లు, ప్రహరీ నిర్మించారు. పక్కనే ఉన్న స్తంభం నుంచి విద్యుత్ కనెక్షన్ కూడా తీసుకున్నారు. ఈ అంశం బస్తీలో నాయకుల మధ్య వివాదాలకు కారణమవుతోంది. తాజాగా వినాయక్ నగర్ పూర్వ అధ్యక్షులు ఈ విషయంలో సోమవారం వాగ్వాదానికి దిగారు.



వినాయక్‌నగర్ ప్రధాన రహదారిపై అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణం

బస్తీకి చెందిన నాయకులు కాకుండా, ఇతర బస్తీలకు చెందిన వారు జోక్యం చేసుకుంటున్నారని మాజీ అధ్యక్షులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంలో పెద్దమొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు వారు విమర్శిస్తున్నారు. ఆరు నెలల క్రితం ఇల్లు, ప్రహరీ కూల్చిన అధికారులు ఇప్పుడు అదేచోట కట్టిన వాటిపై చర్యలు తీసుకోకుండా మిన్నకుండడం అనుమానాలకు తావిస్తోందని అంటున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని రహదారిపై నిర్మించిన ఇల్లు, ప్రహరీ తొలగించాలని బస్తీ మాజీ అధ్యక్షుడు వై.వీరాస్వామి యాదవ్, మాణిక్యం, సి.కేశవులు కోరుతున్నారు.



గతంలో కూల్చిన ఇంటి వద్ద జీహెచ్ఎంసీ, రెవెన్యూ సిబ్బంది

చర్యలు తీసుకుంటాం

వినాయక్ నగర్ ప్రధాన రహదారిపై కట్టిన ఇల్లు, ప్రహరీని గతంలో రెవెన్యూ సిబ్బందితో కలిసి కూల్చివేశాం. ఆ స్థలంలో మరోసారి ఇల్లు, ప్రహరీ నిర్మించినట్లు మా దృష్టికి వచ్చింది. తప్పకుండా త్వరలోనే చర్యలు తీసుకుంటాం.

ఎస్.ప్రసీద, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ, జీహెచ్ఎంసీ సర్కిల్-19



ఎంఎస్ మక్తాలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ ఎస్‌కె.షరీఫ్ తదితరులు

● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి



జూబ్లీహిల్స్ డివిజన్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ జోనల్ కమిషనర్ అనురాగ్‌జయంతికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి



లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన బండారు దత్తాత్రేయ తదితరులు

ఘనంగా గీతా జయంతి

బంజారాహిల్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లోని స్వయంభు లక్ష్మీనరసింహస్వామి(స్వర్ణ) ఆలయంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం గీతా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బడి పిల్లలతో గీతాపారాయణం పేరిట 1008 మంది చిన్నారులతో గీతా శ్లోకాల పారాయణం జరిగింది. అనంతరం రాధాకృష్ణులకు, లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవన గమనాన్ని గీత బోధిస్తుందన్నారు. గీతలో ఉన్న ప్రతీ అంశం ధర్మానికి సంబంధించిందని, ఇందులోని సారాంశాన్ని ప్రతీ ఒక్కరు అర్థం చేసుకొని నిజ జీవితం అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస, బీజేపీ నేత శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలుషిత జలాల సమస్యను పరిష్కరించాలి

● ప్రజావాణిలో సీపీఎం ఫిర్యాదు

బోరబండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బోరబండ బలహీనవర్గాల కాలనీలో కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కమిటీ నాయకులు కోరారు. ఎస్.ఆర్.నగర్ జలమండలి కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో బస్తీ ప్రజల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని జీఎం ప్రభాకర్‌రావుకు వారు సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జూబ్లీహిల్స్ జోన్ కమిటీ నాయకులు టి.సాయి శేషగిరిరావు, జూకటి స్వామి మాట్లాడుతూ రెండు వారాల నుంచి బ్రాహ్మణవాడి, పెద్దమ్మగుడి నగర్ బస్తీలో దుర్గంధంతో కూడిన డ్రైనేజీ నీరు నల్లాల ద్వారా సరఫరా అవుతున్నాయని తెలిపారు. జలమండలి స్థానిక మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేనందున ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు. దీనిపై స్పందించిన జీఎం ప్రభాకర్ రావు రేపే సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం కార్యకర్తలు కె.దిలీప్, నయీమ్ పటేల్, కృష్ణ, విష్ణుమూర్తి, సికిందర్ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

శిశు విహార్ ఆయాల వేతన బకాయిలు చెల్లించాలి

పంజాగుట్ట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం ఆవరణలోని శిశువిహార్ ఆయాలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని శిశువిహార్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) కార్యనిర్వాహక అధ్యక్షుడు రాపర్తి అశోక్ విజ్ఞప్తి చేశారు. ఐదు నెలల బకాయి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన అధికారులు జిల్లా సంక్షేమ అధికారిని వెంటనే జీతాలు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని, వారం రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారని ఆయన తెలిపారు. ఆయన వెంట యూనియన్ నాయకులు సుశీల, పద్మ, తదితరులు ఉన్నారు.

బుల్కాపూర్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు

● ఒకరు మృతిచెందినా స్పందించని అధికారులు

పంజాగుట్ట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బుల్కాపూర్ నాలాలో వ్యర్థాలు పేరుకుపోయినా అధికారులు స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. బంజారాహిల్స్ నుంచి ఆనంద్ నగర్ కాలనీ, తుమ్మల బస్తీ మధ్య నుంచి బుల్కాపూర్ నాలా ప్రవహిస్తోంది. భారీ వర్షాలు పడ్డప్పుడు పై నుంచి వచ్చిన వర్షపు నీరు నాలాపై నుంచి ప్రవహించి ఖైరతాబాద్ ప్రధాన రహదారితో పాటు తుమ్మలబస్తీ, ప్రేమ్‌నగర్, ఆనంద్ నగర్‌లలో మోకాలి లోతు నీరు నిలుస్తోంది. కొన్ని ఇళ్లలోకి వర్షం నీరు వచ్చి నిలుస్తోంది. ఖైరతాబాద్ ప్రధాన రహదారి నుంచి తుమ్మలబస్తీకి వెళ్లే మార్గంలో బ్రిడ్జి కింది నుంచి 50 అడుగుల పొడవునా థర్మకోల్, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి.

గతంలో ఇదే ప్రాంతంలో నాలాలోకి దిగి వ్యర్థాలను ఏరుకునే క్రమంలో ఓ వ్యక్తి వాటి మధ్య ఇరుక్కొని మృతిచెందాడు. అయినా, అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ఖైరతాబాద్ వద్ద బుల్కాపూర్ నాలాలో పేరుకుపోయిన థర్మకోల్ వ్యర్థాలు

జూబ్లీహిల్స్ అభివృద్ధికి సహకరించండి

● కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే



కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్

యూసుఫ్‌గూడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ సోమవారం మర్యాద పూర్వకంగా కార్యాలయాల్లో కలిశారు. నియోజకవర్గ సమస్యలపై కలెక్టర్, కమిషనర్‌తో భారీ వర్షాలకు శిథిలమైన రోడ్లకు మరమ్మతులు, సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ పైపులైన్, కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పన, శానిటేషన్‌తో పాటు పలు అంశాలపై చర్చించినట్లు ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్, కమిషనర్ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని ఎమ్మెల్యే కలిశారు. ఉప ఎన్నికలో పార్టీ గెలుపునకు విశేష కృషి చేసిందుకు మంత్రికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బీసీలను మోసం చేశారని సీఎంపై పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు

పంజాగుట్ట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి నమ్మించి మోసం చేశారని, ఆయనపై రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో చీటింగ్ కేసులు పెట్టాలని ఫిర్యాదు చేస్తామని క్రిస్టియన్ ముస్లిం దళిత ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.అజయ్ బాబు తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా క్రిస్టియన్, ముస్లిం, దళితులపై దాడులు పెరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫ్రంట్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. క్రిస్టియన్, ముస్లింలు, దళితులపై జరుగుతున్న దాడులను ఎదుర్కోవడానికే, బీజేపీ, ఆర్ఎస్ఎస్, తదితర సంస్థల నుంచి రక్షించడానికి ఫ్రంట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఉత్తర భారతదేశంలోని 12 రాష్ట్రాలలో బలవంతపు మతమార్పిడి పేరుతో బిల్లు తెచ్చారని, దీని వల్ల తమ మత గ్రంథాలను బహిరంగంగా పట్టుకుని పోయే పరిస్థితి లేదని అన్నారు.ఇప్పటికే సుమారు 15 వేల మంది పాస్టర్లపైన కేసులు పెట్టారని అన్నారు. తెలంగాణ, ఏపీలో అధికారంలోకి రావాలని బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. దళితులు అయ్యప్ప మాల వేసుకుంటే వారిని దేవాలయాలలోకి రానివ్వడం లేదని, దీనిని బీజేపీ ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నిక జరిగితే తమ అభ్యర్థిగా ఎం.విజయ్‌రాజ్ పోటీ చేస్తారని ప్రకటించారు. అనంతరం ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడిగా ఎం.ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడిగా కొండా అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.విజయ్‌రాజ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా జి.లక్ష్మి, జాతీయ కార్యదర్శిగా జి.అనంద్, రాజేష్ కుమార్, కిరణ్‌ను నియమించారు. సమావేశంలో ఫ్రంట్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌బాబు

పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న పాస్టర్‌లు

బంజారాహిల్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లో పాస్టర్స్ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. తెలంగాణ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ దీపక్ జాన్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి సంబరాలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పాస్టర్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు చెప్పారు. ఈ యేడాది క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రెవరెండ్ ఎం ప్రభుదాస్, రెవరెండ్ చిట్టిబాబు, వర్షిప్ రెవరెండ్ సంపత్ మోజస్, ఖైరతాబాద్ క్రిస్టియన్ ఫోరం అధ్యక్షుడు ఆంటోనీ దాస్, ఫెలోషిప్ ఛైర్మన్ కరుణాకర్ మోజెస్, ఖైరతాబాద్ నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.బి.పీటర్, ఫిలింనగర్ స్థానిక సంఘం కాపరి కృపారావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్యం

అడ్డగుట్ట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి ఏఆర్‌టీ సెంటర్‌లో హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుతుందని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి సూచించారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రిలోని జనరల్ మెడిసిన్ విభాగంలో ఏఆర్‌టీ సెంటర్ ఆధ్వర్యంలో వైద్యులు ఆస్పత్రి ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వార్డులో చికిత్స పొందుతున్న హెచ్ఐవీ బాధితులకు దుప్పట్లు, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ ఎల్.సునీల్ కుమార్, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజారాం, ప్రొఫెసర్ రవిశేఖర్, సూపరింటెండెంట్ ఎం.పద్మ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ ప్రమోద్ కుమార్

ఎర్రగడ్డ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధిపై ప్రతీ ఒక్కరికి అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఎర్రగడ్డ చెస్ట్ ఆస్పత్రి సీనియర్ వైద్యాధికారి డాక్టర్.ప్రమోద్ కుమార్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం చెస్ట్ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాగ్రత్తలు తీసుకుంటే ఎయిడ్స్ రాదన్నారు. ఎర్రగడ్డ చెస్ట్ ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపవద్దని, వారిని ఆదరించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఎయిడ్స్ వ్యాధి క్రమేపి తగ్గుతూ వస్తుందన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఏఆర్‌టీ మందులను వాడడం వల్ల ఎక్కువ కాలం జీవించే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓలు జయమనోరి, డాక్టర్ సీమ తబస్సుమ్, డాక్టర్ ఆర్.గణేశ్, డాక్టర్ అనిత, డాక్టర్ రుద్ర గణేశ్, సిబ్బంది రత్నాకర్ పాల్గొన్నారు.

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలి

● 5న చలో ఎల్లమ్మగూడెం, 10న చలో గన్‌పార్క్

పంజాగుట్ట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలని బీసీ జనసభ, యాదవ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 5న చలో ఎల్లమ్మగూడెం, 10న చలో గన్‌పార్కు కార్యక్రమానికి బీసీ జనసభ అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా ఎల్లమ్మగూడెంకి చెందిన లక్ష్మీ యాదవ్, యాదగిరి యాదవ్‌కి ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ జనసభ, బీసీ, యాదవ, ఓయూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ చెరుకు సుధాకర్, యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి రమేష్ యాదవ్, బీసీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేష్‌గౌడ్, తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. గత నెల 29న నల్లగొండ జిల్లా ఎల్లమ్మగూడెంకు చెందిన మామిడి యాదగిరి యాదవ్ సర్పంచ్‌గా పోటీ చేయాలని అనుకుంటుండగా, నకిరేకల్‌లో కాంగ్రెస్ నేతలు కిడ్నాప్ చేశారని ఆరోపించారు. కారులో రోజంతా తిప్పుతూ ఓఆర్ఆర్ సమీపంలోని దట్టమైన అడవిలోకి తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేశారని ఆరోపించారు. సమావేశంలో బీసీ కుల సంఘాల అధ్యక్షుడు కాటం నర్సింహ యాదవ్, ఆయా సంఘాల నాయకులు ఎల్.గోవర్ధన్ యాదవ్, బేరి రామచంద్రయ్య యాదవ్, సైదులు, వి.లింగయ్య, కె.రమేష్, ఎస్.మధు, శ్రీధర్, రమేష్, వినోద్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం, ముదిరాజ్ సంఘం నాయకులు

పోలీస్ కిష్టయ్య విగ్రహం ఏర్పాటు చేయాలి

పంజాగుట్ట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేయాలని సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కార్యదర్శి రాపర్తి అశోక్, జవహర్ నగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నెల్లి శంకర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌లో పోలీస్ కిష్టయ్య 16వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ కిష్టయ్య విగ్రహం నగరంలో ఏర్పాటు చేయాలని, తెలంగాణ పోరాటయోధులను ప్రభుత్వం గుర్తించి, వారికి ఇళ్లు, ఉద్యోగాలు, పెన్షన్ వంటి సౌకర్యాలు కల్పించి గౌరవించాలని అన్నారు. కార్యక్రమంలో దండు సత్యనారాయణ, యాదగిరి, ఆసీఫ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11కేవీ స్టేట్ హోమ్, నాందారి టెంట్ హౌస్ ఫీడర్ల పరిధి, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ ఎల్లారెడ్డిగూడ, బంజారాహిల్స్ స్టార్ ఆస్పత్రి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ ఎల్‌వీ సత్యనారాయణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11కేవీ జయప్రకాష్ నగర్, పీలి దర్గా, అవంతి నగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాలతోపాటు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ కార్మిక నగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

గిగ్ కార్మికుల రక్షణ చట్టం రూపకల్పనకు సూచనలు

మియాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం గిగ్ కార్మికుల రక్షణ చట్టాన్ని రూపొందించేందుకు సూచనలతో కూడిన పత్రాన్ని కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి సీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు అందజేశారు. సోమాజిగూడలోని ఆయన నివాసంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డా. టి.సురేష్‌బాబు సోమవారం కలిసి పలు సూచనలు చేశారు. నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధన కేంద్రం దేశంలో మొట్టమొదటి సారిగా గిగ్ ఎకనామీపై సెమినార్ నిర్వహించింది. ఈ సెమినార్‌లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ మాజీ లేబర్ కమిషనర్, డా. కింగ్‌షుక్ సర్కార్, గిగ్ కార్మిక ఫెడరేషన్ నాయకులు షేక్ సలాహుద్దీన్, ఉబర్, ఓలా, స్విగ్గీ, జొమాటో వంటి సంస్థల గిగ్ కార్మికులు పాల్గొన్నారు. గిగ్ కార్మికుల సవాళ్లు, అవకాశాలు, సమస్యల పరిష్కారాలపై చర్చించి నివేదికను రూపొందించారు. ఈ నివేదికను వారు మంత్రికి అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకువస్తున్న గిగ్ కార్మికుల సంరక్షణ చట్టాన్ని అధ్యయనం చేసి మరిన్ని సూచనలు చేయాలని మంత్రి వివేక్ వెంకటస్వామి కోరినట్లు సీఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి తెలిపారు.



మంత్రికి సిఫార్సుల పత్రాన్ని అందజేస్తున్న సీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు

'సీఎం ఓయూ పర్యటనను స్వాగతిద్దాం'

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7న సీఎం రేవంత్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ పర్యటనను విద్యార్థులు, స్కాలర్లు, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది స్వాగతిద్దామని ఓయూ పొలిటికల్ సైన్స్ రీసెర్చ్ స్కాలర్, తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జాక్ వ్యవస్థాపకుడు వలిగొండ నరసింహ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి మళ్లీ ఓయూ వస్తుండటం విశేషమని పేర్కొన్నారు. గత పాలకులు నిధులు, నియామకాలు చేపట్టకుండా ఓయూను నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం ఉన్నత విద్య బలోపేతానికి కీలక నిర్ణయాలు తీసుకుంటోందని వివరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలు, ప్రత్యేక తెలంగాణ విద్యా పాలసీ, ప్రపంచ ఉత్తమ విశ్వవిద్యాలయాల మాదిరిగా ఓయూను అభివృద్ధి చేసే దిశగా సీఎం చర్యలు అభినందనీయమన్నారు.

చికిత్స పొందుతున్న యువతి మృతి

అమీర్‌పేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత నెల 24న ప్రమాదవశాత్తు బిల్డింగ్ మెట్లపై నుంచి కిందపడి గాయాలపాలైన యువతి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందింది. ఎస్ఐ రాజురాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గాయత్రి నగర్‌కు చెందిన స్నేహ(18) ఈనెల 24న సెల్‌ఫోన్ మాట్లాడుతూ మెట్లపై నుంచి కిందపడడంతో తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చికిత్స నిమిత్తం నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది.

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

అమీర్‌పేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట లీలానగర్‌లో ఆదివారం 8 సంవత్సరాల చిన్నారిపై అసభ్యంగా ప్రవర్తించిన మోహన్ రంజిత్ (45)ను ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్ కు తరలించారు. ఎస్ఐ రాజు రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం లీలానగర్ ధాత్రి హోమ్స్‌లో నివాసం ఉంటున్న మోహన్ రంజిత్ తన కొడుకులతో ఆడుకునేందుకు వచ్చిన 8 సంవత్సరాల వయస్సు ఉన్న బాలికను గిల్లుతూ చాతి, చెంపలపై కొరుకుతూ అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేస్తూ అతని నుండి తప్పించుకుని తను ఉంటున్న రూమ్ కు వెళ్లి జరిగిన విషయాన్ని తండ్రితో చెప్పింది. వెంటనే ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ కు చేరుకుని ఆదివారం పిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం రిమాండ్ కు తరలించారు.



లబ్ధిదారులకు ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

పేదల వైద్యానికి ప్రాముఖ్యం

బౌద్ధనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు వైద్యసేవలందించేందుకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నామని, విద్య, వైద్య రంగాలను పేదలకు చేరువలో నిలుపుతామని సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. బౌద్ధనగర్, సీతాఫల్‌మండికి చెందిన సరళ, కీర్తన అస్వస్థతకు గురై ఎమ్మెల్యే కార్యాలయాన్ని ఆశ్రయించడంతో వారిని ఆదుకునేందుకు, వైద్యసేవలకు వీలుగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌ఓసీ) పత్రాలను సమకూర్చారు. సోమవారం సీతాఫల్‌మండిలో లబ్ధిదారులకు రెండులక్షల చొప్పున ఎల్‌ఓసీ పత్రాలను ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, రవి పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న కార్పొరేటర్ కొంతం దీపిక, భక్తులు

ముత్యాలమ్మ వార్షికోత్సవ పూజలు

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం పునఃప్రతిష్ఠ జరిగి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుల ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. సోమవారం పూజలో కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం పూర్ణాహుతి పూజలో పాల్గొన్నారు. బీజేపీ నాయకులు కొంతం నరేష్, భక్తులు పాల్గొన్నారు.



వైన్స్‌షాపు ఏర్పాటు చేయవద్దని ధర్నా చేస్తున్న మహిళలు

వైన్స్‌షాపు ఏర్పాటు చేయొద్దని ధర్నా

తిరుమలగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్‌లోని పాత కల్లు కాంపౌండ్ స్థానంలో వైన్స్‌షాపు ఏర్పాటు చేయొద్దంటూ చిన్న కమేలబస్తీ మహిళలు, యూత్ సోమవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ బస్తీకి వెళ్లే మార్గంలో వైన్స్ ఏర్పాటు చేస్తే మహిళలు, విద్యార్థుల రక్షణ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వైన్స్‌షాపుకు సంబంధించిన భారీ కంటెయినర్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. సమీపంలో ఉన్న హనుమాన్ దేవాలయానికి వచ్చే భక్తులకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నగేనేని సరిత, మురళీ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. బస్తీ వాసులు మహేష్, మహిళలు పాల్గొన్నారు.



పోలీస్ కిష్టయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సామల హేమ, ముదిరాజ్ సంఘం నాయకులు

పోలీస్ కిష్టయ్యకు నివాళి

బౌద్ధనగర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలిదశ అమరవీరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతి వేడుకలను సోమవారం వారాసిగూడ ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద నిర్వహించారు. సికింద్రాబాద్ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ ముఖ్యఅతిథిగా పాల్గొని పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రాన్ని అందజేస్తున్న ఐహెచ్‌ఆర్‌సీఐ జాతీయ అధ్యక్షుడు కటకం శ్రీనివాస్, బీజేపీ నేత చీకోటి ప్రవీణ్

మానవ హక్కులపై అవగాహన కల్పించాలి

అడ్డగుట్ట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మానవ హక్కులపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఐహెచ్‌ఆర్‌సీఐ సభ్యులకు ఎంతైనా ఉందని మానవ హక్కుల కమిటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు కటకం శ్రీనివాస్ అన్నారు. సికింద్రాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఐహెచ్‌ఆర్‌సీఐ జాతీయ కల్చరల్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికైన గుజరాతి పూనం శయిల్‌కు నియామకపత్రాన్ని బీజేపీ నేత చీకోటి ప్రవీణ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఐహెచ్‌ఆర్‌సీఐ ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐహెచ్‌ఆర్‌సీఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వాడకట్టు శ్రీకాంత్, తెలంగాణ మీడియా కమిటీ ఛైర్మన్ సామ శ్రీధర్‌లతో పాటు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



వరగంటి సాగర్

అడ్డగుట్ట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : లాడ్జిలో బస చేసిన ఓ వ్యక్తి బయటికి వెళ్లి అదృశ్యమైన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మాధవి తెలిపిన వివరాల ప్రకారం కీసర బోగారం ప్రాంతానికి చెందిన వరగంటి సాగర్(28) ఆర్థికపరమైన ఇబ్బందులతో బాధపడుతున్నాడు. గత నెల 9న సికింద్రాబాద్‌లోని ఓ లాడ్జిలో బస చేసి టీ తాగుదామని బయటికి వెళ్లి తిరిగి రాలేదు. నవంబరు 16 వరకు ఇతడు రాకపోవడంతో విషయం తెలుసుకున్న గోపాలపురం పోలీసులు వివిధ కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. అతడి కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో 1న (సోమవారం) గోపాలపురం పోలీసులు మిస్సింగ్ కింద కేసు నమోదు చేశారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే వెంటనే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని లేదంటే 8712660209 నంబరుకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.





బోయినపల్లి సెంటర్ పాయింట్ వద్ద లీక్ అవుతున్న తాగునీరు

తాగునీరు.. రోడ్డుపాలు

- బోయినపల్లి సెంటర్ పాయింట్ వద్ద పైప్‌లైన్ లీక్
- పట్టించుకోని అధికారులు
- మరమ్మతులు చేయాలని స్థానికుల డిమాండ్

బోయినపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు ఆరవ వార్డు పరిధిలోని సెంటర్ పాయింట్ వద్ద తాగునీటి మెయిన్ పైపులైన్ పగిలిపోవడంతో తాగునీరు వృథాగా పోతుంది. ఐదు రోజులుగా ప్రధాన రహదారిలో నీరు పరుగులు తీస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు అంటున్నారు. చుట్టుపక్కల, మిలిటరీ ప్రాంతాలకు సరఫరా కావాల్సిన తాగునీరంతా కాలువల్లో కలిసి పోతున్నది. అసలే ఈ ప్రాంతంలో రహదారి గుంతలమయంగా ఉంది. దీనికి తోడు నీరు రోడ్డు మీద ప్రవహించి నిలవడంతో వాహనదారులు, స్థానిక వ్యాపారస్తులకు మరింత ఇబ్బందిగా మారింది. స్థానికులు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల పలు ప్రాంతాలకు తాత్కాలికంగా నీటి సరఫరా నిలిచిపోవడంతో పాటు, పగిలిన పైపులైన్ నుంచి మురుగు పారడంతో తాగునీరు కలుషితమవుతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఇలాంటి పరిస్థితులు పునరావృత్తం కాకుండా అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కాగా ఇదే ప్రాంతం నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానిక వ్యాపారస్తులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి



సెంటర్ పాయింట్ వద్ద పైప్‌లైన్ పగిలి తాగునీరు వృథాగా పోతున్నది. దీంతో రోడ్లు గుంతలమయంగా మారి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతున్నది. ఐదు రోజులైనా అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే అధికారులు స్పందించి మరమ్మతులు చేసి నీరు వృథాగా పోకుండా అరికట్టాలి.

- బాలరాజ్ యాదవ్, స్థానికుడు

అధికారులు ఉన్నారా? లేరా?



ఐదు రోజులుగా తాగునీరు వృథాగా పోతున్నా ఎవరూ స్పందించడం లేదు దానికి తోడు ప్రవహిస్తున్న నీరుతో రోడ్లపై గుంతలు పడి ప్రమాదకరంగా మారుతున్నాయి. పాదచారులపై బురదనీరు పడుతుండటంతో వాహనదారులకు, పాదచారులకు మధ్య ఘర్షణలు కూడా చోటు చేసుకుంటున్నాయి.

- విశ్వనాథ్, స్థానికుడు

'హస్తం' పటిష్ఠతపై ప్రత్యేక దృష్టి

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీగణేశ్

సికింద్రాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బహుముఖ ప్రణాళికతో సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్ఠం చేయడానికి స్థానిక శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్ ప్రత్యేక దృష్టి సారించారు. అటు కంటోన్మెంట్ బోర్డు పాలకమండలి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా, ఇటు జీహెచ్‌ఎంసీ ఎన్నికల నగారా ఎప్పుడు మోగినా.. నియోజకవర్గంలో హస్తం పార్టీ విజయ పతాకాన్ని రెపరెపలాడించడమే ధ్యేయంగా ఇప్పటినుంచే పావులు కదుపుతున్నారు. దీనిలో భాగంగా గడిచిన కొద్ది రోజులుగా కంటోన్మెంట్ బోర్డు, జీహెచ్‌ఎంసీ పరిధిలోని మోండా మార్కెట్ డివిజన్‌లో అభివృద్ధి పనులను ముమ్మరం చేశారు. అలాగే పార్టీలో చేరికలపై తాజాగా ప్రత్యేక దృష్టి సారించి ఆయా వార్డులు, డివిజన్ నుంచి ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలను, తటస్థులను హస్తం పార్టీలో చేర్చుకుంటున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల కోసం తన వద్దకు వచ్చే ప్రతిపక్షాల నాయకులు, కార్యకర్తలతో పిచ్చాపాటి మాట్లాడుతూ, వారు అధికార పక్షంలో చేరితే మరింత ప్రజాసేవ చేయవచ్చని, వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని భరోసా ఇస్తున్నారు. ఎమ్మెల్యే మాటలపై నమ్మకంతో కొద్ది రోజులుగా ఆయా వార్డులు, జీహెచ్‌ఎంసీ పరిధిలోని మోండా మార్కెట్ డివిజన్‌లోని కాంగ్రెస్ నేతలు ఆయనను కలుస్తున్నారు. ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు, తటస్థులను హస్తం పార్టీ గూటికి చేర్చడంపై చర్చించి, ఉత్సాహంగా పని చేస్తున్నారు.

తాజాగా సోమవారం 2వ వార్డు రసూల్‌పురా ఇందిరమ్మనగర్ నుంచి ఎండి.అబ్బు, నాగేష్, షరీఫ్, పాండు, వెంకటయ్య, సంతోష్, 3వ వార్డు సిక్‌విలేజీ డబుల్‌బెడ్ రూమ్ ప్రాంతం నుంచి మోపతి స్వప్న ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి వారికి స్వాగతం పలికారు. కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు యాదగిరి, నరేష్, తౌఫిక్, రఫీక్, శ్రీనివాస్, మల్లేష్, మహేష్, ఉత్తరయ్య తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని వారికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

ఈశ్వరీబాయి సేవలు చిరస్మరణీయం : ఎమ్మెల్యే

మారేడుపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాధికారంతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని నమ్మి రాజకీయాల్లోకి వచ్చి కౌన్సిలర్‌గా, ఎమ్మెల్యేగా సేవలందించిన ఈశ్వరీ బాయి సేవలు చిరస్మరణీయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ కొనియాడారు. ఈశ్వరీబాయి 107వ జయంతిని సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మారేడుపల్లి సెయింట్ జాన్స్ చౌరాస్తా వద్ద మాజీ మంత్రి డాక్టర్ జె.గీతారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే పాల్గొని ఈశ్వరీబాయి విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆమె గొప్పతనాన్ని, త్యాగాలను గుర్తించి జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామచంద్రారెడ్డి, ప్రముఖులు మేఘనారెడ్డి, దయానందరావు, శివకుమార్, జైభీమ్, మహేష్‌బాబు, కె.నర్సింహులు, ఉమేష్ బాబు, కపిలేశ్వర్, ప్రదీప్, ఈశ్వరీబాయి నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్‌తో పాటు నర్సింగ్ కళాశాల విద్యార్థులు, నాయకులు నాగేష్ యాదవ్, బద్రీనాథ్ యాదవ్, సంతోష్ యాదవ్, బాబురావు, శేఖర్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్యం

సూపరింటెండెంట్ డాక్టర్ వాణి



రోగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి

అడ్డగుట్ట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గాంధీ ఆస్పత్రి ఏఆర్‌టీ సెంటర్‌లో హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుతుందని గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి సూచించారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రిలోని జనరల్ మెడిసిన్ విభాగంలో ఏఆర్‌టీ సెంటర్ ఆధ్వర్యంలో వైద్యులు ఆస్పత్రి ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు ధైర్యంగా ఉండాలని, వారికి గాంధీలో కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుతుందన్నారు. అనంతరం వార్డులో చికిత్స పొందుతున్న హెచ్‌ఐవీ బాధితులకు దుప్పట్లు, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ విభాగాధిపతి ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ ఎల్.సునిల్ కుమార్, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజారాం, కంటి విభాగాధిపతి ప్రొఫెసర్ కే. రవి శేఖర్, ప్రొఫెసర్లు చంద్రశేఖర్, సురేఖ, కోటేశ్వరమ్మ, ఆర్‌ఎంఓ డాక్టర్ శేషాద్రి, కళ్యాణి చక్రవర్తి, యుగేందర్, రజినీ, సరి, డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. దీపక్, డెర్మాటాలజీ విభాగాధిపతి సి.సుధారాణి, గైనిక్ విభాగాధిపతి టి శోభ, మైక్రోబయోలాజీ ఇన్‌చార్జి డాక్టర్ జేకే సురేఖ, ఏఆర్‌టీ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ రాధిక, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎం. పద్మలు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

ఆరు నెలలైనా అమలు కాని సీఎం హామీ

- కాంట్రాక్ట్ అధ్యాపకుల ఆందోళన

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలల క్రితమే సీఎం ఆదేశించిన యూజీసీ పే స్కేలు (బేసిక్+డిఏ+ఇంక్రిమెంట్+హెచ్‌ఆర్‌ఏ) ఇప్పటికీ అమలు కాలేదని ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఓయూలోని ఆర్ట్స్ కళాశాల వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 7న సీఎం రేవంత్ రెడ్డి ఓయూ పర్యటనను స్వాగతిస్తున్నామన్నారు. విద్యాబోధన, పరిపాలనలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న తమకు న్యాయం చేయాలని కోరారు. సీఎం స్పష్టమైన ఆదేశాలను కొంతమంది అధికారులు ఉద్దేశపూర్వకంగా నిలిపేశారని ఆరోపించారు. డిసెంబరు 5న కాంట్రాక్ట్ అధ్యాపకుల స్టేట్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నివేదన సభను నిర్వహిస్తున్నామని, జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్ తదితర మేధావులు హాజరుకానున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు డా. ఇ.ఉపేందర్, డా. సిహెచ్.వెంకటేష్, డా.తాళ్లపల్లి వెంకటేష్, డా.జి.వెంకటేష్, డా.మహేశ్వర్ రెడ్డి, డా.రవి నాయక్, డా.సనత్, డా.రామలింగం, డా.భూక్యా రమేష్, డా.హరీష్ పాల్గొన్నారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గంలో ఓయూ నేత జీవన్‌కు చోటు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు జీవన్ ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. డెహ్రాడూన్‌లో జరుగుతున్న 71వ జాతీయ మహాసభల్లో ఆయన పేరు అధికారికంగా ప్రకటించారు. నిజాం కాలేజీలో చదువుతున్నప్పటి నుంచే ఏబీవీపీలో చురుకుగా పనిచేస్తూ, తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన జీవన్, సంస్థలో జిల్లా నుంచి రాష్ట్ర స్థాయివరకు పలు బాధ్యతలు నిర్వహించారు. జాతీయ స్థాయిలో బాధ్యతలు రావడం తనపై మరింత కర్తవ్య బాధ్యత పెంచిందని, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాటం కొనసాగిస్తానని ఆయన తెలిపారు.

ప్రతి విద్యార్థికీ హాస్టల్ సౌకర్యం కల్పించాలి

- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలో సీటు పొందిన ప్రతి విద్యార్థికి వయస్సు పరిమితి లేకుండా హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరుతూ బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోమవారం లేఖ రాశారు. హాస్టల్ కేటాయింపుల్లో 28 ఏళ్ల వయస్సు పరిమితి ఎక్కడా ప్రకటనల్లో, వెబ్ ఆప్షన్లలో, పీజీ నోటిఫికేషన్‌లో పేర్కొనలేదని అన్నారు. ఈ అనాలోచిత నిర్ణయంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కొత్త నిబంధనల కారణంగా నెట్, సెట్, సీఎస్ఐఆర్, టెట్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వేలాది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. త్వరలో సీఎం ఉస్మానియా యూనివర్సిటీకి రానుండగా, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లింగం గౌడ్ విజ్ఞప్తి చేశారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని, తదితరులు

కల్యాణలక్ష్మి పథకం బీఆర్‌ఎస్ ఘనతే : తలసాని

మారేడుపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పేదింటి ఆడపడుచు పెండ్లికి ఆర్థిక సహాయం అందించిన ఘనత తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలో సనత్‌నగర్ డివిజన్‌కు చెందిన 11 మంది లబ్ధిదారులకు 8 షాదీ ముబారక్, 3 కల్యాణలక్ష్మి ఆర్థిక సహాయ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపడుచు పెండ్లికి కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా కల్యాణలక్ష్మి, షాదిముబారక్‌ల కింద ఒక్కొక్క లబ్ధిదారులకు ఒక లక్ష 116 రూపాయల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మి, బాలానగర్ తహసీల్దార్ కార్యాలయం ఆర్ఐ నాగమణి, నాయకులు కొలన్ బాల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జమీర్, సురేందర్, వసీం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి సహకరించండి

సికింద్రాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని, దీనికి తగిన సహకారం అందించాలని మాజీమంత్రి, సనత్‌నగర్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గజ్జెల నాగేష్ విజ్ఞప్తి చేశారు. సోమవారం మారేడుపల్లిలోని తలసాని నివాసంలో బోయినపల్లి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్‌తో తలసానిని ఆయన కలిశారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని అన్ని వార్డుల్లో, జీహెచ్‌ఎంసీ పరిధిలోని మోండా మార్కెట్ డివిజన్‌లో ఇప్పటికీ బీఆర్‌ఎస్ పార్టీ చెక్కుచెదరకుండా ఉందని, నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్ఠం చేయడానికి తాము కృషి చేయనున్నట్టు గజ్జెల నాగేష్ చెప్పారు. ఇందుకు తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారం కావాలని కోరారు.



బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అధికారులను ఆదేశించారు. బస్తీల పర్యటనలో భాగంగా సోమవారం మోండా డివిజన్‌లోని రెజిమెంటల్‌బజార్‌లో అధికారులతో కలిసి పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లాడి గౌరీశంకర్, బాబురావు ముదిరాజ్, నందికంటి రవి, సంతోష్ యాదవ్, శ్రీను, బద్రీనాద్ యాదవ్, నాగేష్ యాదవ్, ప్రభాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్, మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

తార్నాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : లాలాపేట్‌లో నిర్మిస్తున్న స్విమ్మింగ్‌పూల్, మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి లాలాపేట్‌లో పర్యటించిన ఆయన నిర్మాణ దశలో ఉన్న స్విమ్మింగ్‌పూల్, మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్, ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తి చేసి త్వరలోనే వీటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు మాధవి, వేణు, స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సునీల్ ముదిరాజ్, నాగేశ్వర్ గౌడ్, వేణుగోపాల్ రెడ్డి, మల్లికార్జున్, జింకల మల్లేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

గణితంలో మెళకువలపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న నర్రా భూపతిరెడ్డి

సికింద్రాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నిబిడీకృతమైన సృజనాత్మకతను వెలికితీసి, వాటికి పదును పెట్టడమే లక్ష్యంగా, సంఖ్యాశాస్త్రంలోని మెళకువలు, నిత్య జీవితంలో వాటి అనువర్తనాలు అనే అంశంపై జరిగిన సదస్సుకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. రసూల్‌పురాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన సదస్సులో ఆసక్తిగా సాగింది. ఈఎస్ఆర్ఈఎస్‌టీఏ వ్యవస్థాపకులు నర్రాభూపతి రెడ్డి మాట్లాడుతూ గణితం కేవలం చిక్కు లెక్కలను సాధించే ప్రక్రియ మాత్రమే కాదని, మన జీవితంలో అనేక సమస్యలకు సులభ పరిష్కారం చూపుతుందని అన్నారు. రసూల్‌పురా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగనాథ్ మాట్లాడుతూ గణితం వింటే సరిపోదని, నిరంతర సాధన చేయాలని, ఒక్కసారి గణితంపై ఆసక్తి పెంచుకుంటే ఏమాత్రం కష్టం కాదని తెలిపారు. మాలతీబాయి, బాలకృష్ణ, పి.చంద్రకళ, పి.చిన్నా, అధ్యాపకులు పాల్గొన్నారు.